
హఫీజ్‌పేట్ పాఠశాల ఆవరణలో వాహనాల పార్కింగ్


హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల పరిస్థితి


ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మట్టికుప్పలు, బండరాళ్లు


పెచ్చులూడిపోతున్న పాఠశాల గోడలు

సమస్యలమయం సరస్వతీ నిలయాలు

పలు పాఠశాలల్లో సౌకర్యాల లేమి ● హైటెక్ ప్రాంతంలో పలు స్కూళ్లకు సీఎస్‌ఆర్ చేయూత


అస్తవ్యస్తంగా ఉన్న హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల

ప్రభుత్వ విద్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మన ఊరు–మనబడి పథకం కింద నిధుల విడుదల, మౌలిక వసతుల కల్పనపై నీలినీడలు అలుముకున్నాయి. శేరిలింగంపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పలు ఐటీ సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు మౌలిక వసతులు కల్పించినా ఇంకా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదని చెప్పకతప్పదు. కొన్నింటిలో సౌకర్యాలు మెరుగుపడినా, మిగతా చోట్ల ఆశించిన అభివృద్ధి జరగలేదు.

– శేరిలింగంపల్లిజోన్ బృందం

శేరిలింగంపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో సుమారు 1100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 6 తరగతి నుంచి 10 తరగతి వరకు విద్యాబోధన సాగుతోంది. మండల పరిధిలోనే అత్యధిక విద్యార్థులు ఉన్న స్కూళ్లలో శేరిలింగంపల్లి ఒకటైనా సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

పలు పాఠశాలల్లో సమస్యలు

- నానక్‌రాంగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చాలి
- మధురానగర్ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి
- మియాపూర్ న్యూకాలనీ ప్రాథమిక పాఠశాల, మక్తామహబూబ్‌పేట్ ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులు లేవు. ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు.
- మక్తామహబూబ్‌పేట్‌లోని పాఠశాల వెనుక చెత్త డంపింగ్‌యార్డు ఉండడంతో ఈగలు, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది.
- హఫీజ్‌పేట్ ప్రాథమిక పాఠశాల గోడలు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఆవరణలో మట్టికుప్పలు, ప్రైవేటు వాహనాల అక్రమ పార్కింగ్
- చందానగర్ శంకర్‌నగర్ వీకర్‌సెక్షన్‌లో ప్రభుత్వ పాఠశాల ,మియాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నీటి సమస్య ఉంది. ఈ రెండు పాఠశాలలు ఒకే చోట ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

పలువురి చేయూత

- లింగంపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, గచ్చిబౌలి జెడ్పీహెచ్ఎస్, రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖానాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మధురానగర్ ప్రాథమిక పాఠశాల, నానక్‌రాంగూడ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఐటీ, స్వచ్ఛంద సంస్థలు చేయూత అందించడంతో అదనపు తరగతి గదులు, వంట గది, కంప్యూటర్ ల్యాబ్, మోడల్ టాయిలెట్స్ తదితరాలకు నోచుకున్నాయి.

శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

- శేరిలింగంపల్లి మండలంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు: 59
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు: 13 జెడ్పీహెచ్ఎస్‌లు
- ప్రాథమికోన్నత పాఠశాలలు: 3 యూపీఎస్‌లు
- ప్రాథమిక పాఠశాలలు: 43 పీఎస్‌లు


మియాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ..


మియాపూర్ న్యూకాలనీ పాఠశాలలో..


మియాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ


మాదాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల

ఘనంగా రుద్ర సహిత చండీయాగం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌లోని నేతాజీనగర్‌లో సాయిబాబా ఆలయం 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయంలో రుద్ర సహిత చండీయాగంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జోషి రాఘవేంద్రశర్మ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు స్వర్ణకంకణం తొడిగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, తేజస్విశర్మ, హిమాలయ తపస్వీ సిద్ధయోగి, నాయకులు రాగం అనిరుధ యాదవ్, అభిషేక్ యాదవ్, తిరుమలేష్, గోపాల్‌యాదవ్, రాజు, మహేష్, రంజిత్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవ వేడుకలు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నా రు. ప్రారంభం సందర్భంగా బుధవారం శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, భగవత్ ప్రార్థన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, ప్రతిష్ఠ రుత్విక్ వర్ణం, యాజమాన్య దీక్ష స్వీకరణ, నివేదన, మంగళ శాసనం వంటి పూజా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.

వాంబే కాలనీ సమస్యలను పరిష్కరించండి

ఆల్విన్‌కాలనీ: జీహెచ్‌యంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాంబే కాలనీ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వాంబే కాలనీలో మట్టి కుప్పలు పేరుకుపోయాయని, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. మేయర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బలరామకృష్ణులు తెలిపారు. ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, కల్యాణం, అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

కమిషనర్‌కు వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు చేయాలని కోరుతూ కౌన్సిలర్‌లు కొల్లూరి భరత్, పావనిలు మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు, స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయని అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ కొంతకాలంగా పనిచేయకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతుందని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్


గోపన్‌పల్లిలో పర్యటిస్తున్న జెడ్‌సీ స్నేహ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని బస్తీలలో చేపట్టాల్సిన మౌలిక వసతులపై తగిన ప్రణాళిక రూపొందించాలని జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బస్తీల్లో చేపట్టాల్సిన సీసీరోడ్లు, డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్‌ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి పనులు, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లో చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు తగిన నిధులు మంజూరు చేసిన త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూ డీజీఎం శరత్‌కుమార్, ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, టౌన్‌ప్లానింగ్ అధికారులు రవీందర్‌రావు, రమేష్, ఏఎంఓహెచ్ నగేష్‌నాయక్, నాయకులు హన్మంతునాయక్, రాజు, రమేష్, నర్సింగ్‌నాయక్, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

వాంబే కాలనీలో కార్పొరేటర్ పర్యటన


కాలనీలో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన మంగళవారం జీహెచ్‌యంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి వాంబే కాలనీలో పర్యటించారు. సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాంబే కాలనీల్లో కొన్ని చోట్ల బిల్డింగ్‌ల మధ్య నూతన డ్రైనేజీ లైన్ నిర్మించి, ప్రధాన లైన్‌కు కలిపి సమస్యను పరిష్కరించాలని, తాగునీరు సమస్య లేకుండా చూడాలని వాటర్‌వర్క్స్ అధికారులకు తెలిపారు. కాలనీలో అనేక చోట్ల మట్టి కుప్పలు ఉన్నాయని వాటిని తొలగించాలన్నారు. లేకుంటే వర్షాకాలంలో కుత్బుల్లాపూర్ నుంచి వచ్చే వరద నీటితో ఇబ్బందులు వస్తాయన్నారు. కాలనీలో అవసరమైన సీసీ రోడ్ల కోసం ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ అధికారులు ఏఈ శ్రావణి, వాటర్‌వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఆర్‌పి నాగేశ్వర్ నాయక్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, సూపర్‌వైజర్ శివ, ఎస్ఎఫ్ఎ సుదర్శన్, వెంకట్‌రెడ్డి, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, వెంకట్‌నాయక్, అగ్రవాసు, పోశెట్టి గౌడ్, నరసింహ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: మనిషి దైనందిన జీవితంలో ఎన్ని పనులున్నా ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ప్రాంగణంలో మంగళవారం ఎస్కీ సిబ్బంది, అధికారులు, వివిధ విభాగాల్లో శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థులకు గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ పనైనా చేయగలరన్నారన్నారు. అప్పుడప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అంతకుముందు వైద్యులు బీపీ షుగర్, టెంపరేచర్, ఆర్థో తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కేర్ ఆస్పత్రి డాక్టర్లు మదానీ, ప్రవీణ్, శ్రీదేవి, ఆకాంక్ష, నర్సులు, సిబ్బంది ఎస్కీ ఫ్యాకల్టీ లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, రాజశేఖర్‌రెడ్డి, మనోహరాచారి, ఆదినారాయణ, చంద్రకళ, ఆది, నరేష్, పద్మావతి, శ్రీధర్, తిలక్, కవిత, చంద్రమోహన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి..

- రవాణాశాఖ అధికారులు
- నేటి నుంచి విద్యాసంస్థలు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని, లేని ఎడల సీజ్ చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈనెల 12 నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తున్నారు. ఇప్పటివరకు ఆర్టీఓ కార్యాలయంలో వివిధ స్కూళ్లకు చెందిన 388 బస్సులకు ఫిట్ నెస్ సర్టిఫికెట్‌లు ఇచ్చారు. ఇంకా 95 బస్సులు ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవాల్సి ఉందని రవాణశాఖ అధికారులు తెలిపారు. పటాష్‌చెరు రవాణశాఖ కార్యాలయంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం ,గుమ్మడిదల మండలాలకు చెందిన స్కూళ్ల బస్సులు ప్రతి ఏడాది ఆర్టీఓ కార్యాలయానికి వచ్చి బస్సులకు ఫిట్ నెస్ టెస్ట్ చేయిస్తారు.


నిబంధనలు ఇవి..

- విద్యాసంస్థల బస్సులు విధిగా పసుపు రంగులోనే ఉండాలి.
- బస్సు సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు
- బస్సు నడిపే డ్రైవర్‌కు హెవీ వెహికల్ లైసెన్స్ ఉండాలి. డ్రైవర్ వయసు 55 ఏళ్లలోపు ఉండాలి. బస్సు నడిపేందుకు ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి.


బస్సు లోపల పరిశీలిస్తున్న ఎంవీఐ

- మద్యం తాగి వాహనం నడపకూడదు. అలా చేస్తే లైసెన్స్ రద్దు అవుతుంది.
- పాఠశాలల బస్సు పదిహేనేళ్ల కాల పరిమితి దాటకూడదు
- కుడి, ఎడమవైపు పాఠశాలల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి
- డ్రైవర్ లైసెన్స్‌ను పాఠశాల యజమాన్యం విధిగా ఆర్టీఏ కార్యాలయంలో అందించాలి
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్‌కు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండాలి
- అత్యవసర ద్వారం ఉండాలి, బస్సు డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబర్లు విధిగా ఉండాలి
- నెలకు ఒకసారి బస్సు డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలు విధిగా చేయించాలి
- ప్రతి బస్సులో ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి
- బస్సులో డ్రైవర్, అటెండర్ కచ్చితంగా యూనిఫామ్ ధరించాలి
- విద్యార్థులను స్కూలుకు తీసుకువెళ్లే సమయంలో తిరిగి ఇంటి వద్ద వదిలే సమయంలో విద్యార్థులందరూ బస్సు దిగారా లేదా చూసుకోవాలి. అలాగే రోడ్డు దాటించాల్సిన వస్తే వారిని రోడ్డు దాటించాలి.

కాలం చెల్లిన బస్సులను తీసివేస్తే సమాచారం ఇవ్వాలి



ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవాలి. పటాన్‌చెరు రవాణశాఖ కార్యాలయంలో ఇప్పటివరకు 388 వివిధ విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష చేసాం. ఇంకా 95 బస్సులు రావాల్సిందన్నారు. 12వ తేదీ పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో ఫిటెనెస్ లేకుండా రోడ్లపై తిరిగితే బస్సులను సీజ్ చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. విద్యాసంస్థలు కాలం చెల్లిన బస్సులను తీసివేస్తే రవాణశాఖకు సమాచారం ఇవ్వాలి.

–విజయరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని చరిత్ర విభాగంలో ఎంఏ హిస్టరీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రఫీవుల్లాఅజ్మీ పేర్కొన్నారు. ఎంఏ హిస్టరీలో మొత్తం 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేషన్‌లో మార్కుల (మెరిట్) ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వబడుతాయన్నారు, మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, అంతేకాకుండా ఫోన్ నంబర్లు 9818754676,9454137901, 7007089699లలో సంప్రదించాలని సూచించారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన కార్పొరేటర్



గచ్చిబౌలి: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో కలిసి డివిజన్ సమస్యలతో పాటు పలు అంశాలను భట్టి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సమస్యల పరిష్కరించాలని అభ్యర్థించారు.

గచ్చిబౌలిలో ఓపెన్‌టెక్స్ కార్యాలయం ప్రారంభం



రాయదుర్గం: గచ్చిబౌలిలో ఓపెన్‌టెక్స్ నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఓపెన్‌టెక్స్ రీజియన్ వర్క్‌ఫోర్స్‌లో పెట్టుబడి 25 శాతం వృద్ధిని నమోదు చేసిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ ముహిమజ్జొబ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని ఇంజనీర్లు వ్యాపార క్లౌడ్‌ల కోసం ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలకు నాయకత్వం వహించనున్నారన్నారు.కార్యక్రమంలో సంస్థ అధికారులు రమా భమిడిపాటి, ప్రసాద్ వేమూరు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో భూగర్భడ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలని కోరుతూ మంగళవారం కార్పొరేటర్ పుష్పనగేష్ హైదరాబాద్‌లో జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. నూతన పైప్‌లైన్‌ల పనుల కోసం రూ.3.5 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారన్నారు. ఈ విషయంపై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేత


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న ఇద్దరికి మంజూరైన నిధులు ఎల్‌టీసీ పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన బేవర శ్రీమాన్వితకు లక్ష రూపాయలు, అలాగే సుబ్రహ్మణ్యేశ్వరరావుకు లక్ష రూపాయలు మంజూరు పత్రాలను అందజేశారు. నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు. నాయకులు సాంబశివరావు, బ్రిక్ శ్రీనివాస్, రవి శంకర్, శ్రీజ్యోతి పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ ఫీజు వసూలు చేయకూడదు

ఎంఈఓ పీపీ రాథోడ్

పటాన్‌చెరు టౌన్: ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ ఫీజు తీసుకోకూడదని, అడ్మిషన్ కట్టాలని డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎంఈఓ పీపీ రాథోడ్ తెలిపారు. మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలలో తల్లిదండ్రులు అడ్మిషన్ తొందరపడి తీసుకోకూడదన్నారు. చాలా వరకు ప్రైవేట్ పాఠశాలలో యూనిఫామ్, పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి స్కూళ్లపై నివేదిక తయారు చేసి డీఈఓకు అందజేస్తామన్నారు.ప్రైవేట్ పాఠశాలలో పిల్లలను చేర్చే సమయంలో పాఠశాలకు గుర్తింపు ఉందా లేదా అని తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ లేక్‌లోని ప్రగతినగర్ చెరువులో, బేబీ పాండ్‌లో మంగళవారం అంబీర్ చెరువు సొసైటీ మెంబర్ నరేష్, సూపర్‌వైజర్ డి. నరసింహులు, సిబ్బంది దోమల నివారణకు చర్యలు చేపట్టారు. దోమల నివారణలో భాగంగా ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్ వేశారు. వర్షాకాలం దృష్ట్యా గుంతల్లో, చెరువుల్లో ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్, పనికిరాని ఇంజన్ ఆయిల్, లేదా కిరోసిన్ పోస్తే దోమలు అభివృద్ధి చెందవన్నారు. ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

బైక్ విక్రయం పేరిట సైబర్ మోసం

రూ. 66 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: బైక్ విక్రయం పేరుతో సైబర్ మోసం జరిగిన ఘటన లో బాధితుడు రూ. 66 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్ లో మే 18వ తేదీన ఆర్మీ వ్యక్తినంటూ బైక్ అమ్మకానికి ఉందని ,తక్కువ ధరకు ఇస్తాననే పోస్ట్ కనబడడంతో అపరిచిత వ్యక్తితో మాట్లాడి, ముందుగా రూ.1500 చెల్లించి, అనంతరం మిగతా నగదు చెల్లించాడు. మొత్తం రూ. 66 వేలు చెల్లించి, బైక్ ఎప్పుడు వస్తుందని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, సోమవారం రాత్రి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.